# దళారీ బూర్జువా, భూస్వామ్య పాలనకు, సామ్రాజ్యవాద ఆధిపత్య విధానాలకి వ్యతిరేకంగా ఐక్యమై, పోరాడుదాం!

**2018 సెప్టెంబరు 9, 10 తేదీలలో హైదరాబాదులో సిపిఐ(యం.యల్) కేంద్రకమిటీ 'భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు - ఎదుర్కొంటున్న సవాళ్ళు' అనే అంశంపై నిర్వహించిన నేషనల్ సెమినార్‌లో కా॥అరవింద్ సిన్హా ఇచ్చిన ముగింపు ఉపన్యాసమిది. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి ఆ సెమినార్‌లో ప్రవేశపెట్టిన కీ నోట్‌ను, సెమినార్ రిపోర్టులను గత 'జనశక్తి' సంచికలలో ప్రచురించాము. - సంపాదకుడు**

**అధ్యక్షవర్గం** కామ్రేడ్స్, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధి కామ్రేడ్స్!

మనముందున్న సవాళ్ళపై మొట్టమొదటగా ఇలాంటి సెమినార్‌ను నిర్వహించాలని మన కేంద్రకమిటి నిర్ణయించింది. గత ఒకటిన్నర రోజులుగా మన అభిప్రాయాలను వెలిబుచ్చుకొన్నాం. కా॥అసింరాయ్, మరియు ఇతర కామ్రేడ్స్ దేశంలో ఫాసిస్టు ప్రమాదం గురించి, దాని పెరుగుదల గురించి పేర్కొన్నారు. వివిధ కమ్యూనిస్టు పార్టీలు, వారి సభ్యులు, వారి ప్రజాసంఘాలు, సానుభూతిపరులు, మెరుగైన వారి కార్యకర్తలందరూ కలిస్తే దేశంలో బలమైన శక్తి అని భావించాం. వారు ఒకచోట చేరితే, నిజంగా చరిత్రను మార్చగలరు. పాలకవర్గాల్లో ఒక సెక్షనుకు ప్రాతినిధ్యము వహిస్తున్న ఆరెస్సెస్, బిజెపిలు మితవాద, మతతత్వ, ఫాశిస్టు తరహా చర్యలు సాగిస్తున్నాయి. ఇటువంటి ఉద్రిక్తతలను, వైరుధ్యాలను సృష్టిస్తూ, కష్టభరితమైన ఆర్థిక భారాలను దేశప్రజలమీద ప్రత్యేకంగా శ్రామిక ప్రజలు, విద్యార్థులు, యువకులు, మహిళలు, గిరిజనులు, దళితులు మరియు మధ్యతరగతి వర్గాల మీద మోపడం చాలా ప్రమాదకరంగా వుంది. ఈ పరిస్థితులలో ఈ విధానాలకు వ్యతిరేకమైన నిజమైన చోదకశక్తులు కమ్యూనిస్టు శక్తులు మాత్రమే. ఈ ప్రమాదాన్ని చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది. ప్రాంతీయ పార్టీలు, ఏపిలో టిడిపి, బీహార్‌లో ఆర్‌జెడి, సమాజ్‌వాదిపార్టీ, బహుజన్ పార్టీ మరియు ఇతర అనేక పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇవన్నీ పాలకవర్గ సెక్షన్లకు ప్రాతినిధ్యం వహిస్తాయి. వర్గప్రాతిపదికన విశ్లేషిస్తే బిజెపికి భిన్నమైన మౌలిక దృక్పథం ఇవి కలిగి లేవు. పెట్రోలు ధర పెరిగింది, రూ. 80/-లు దాటుతుందని మాత్రమే మాట్లాడగలవు. అంతేతప్ప ఆ సమస్య పరిష్కారం గురించి మాట్లాడలేవు. మోడీ - ఎన్‌డిఏ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే అవి ప్రభావాన్ని, పలుకుబడిని పొందుతాయి. అయితే, ఇది సమస్యనేమీ పరిష్కరించదు. ఒకట్రెండు రోజుల క్రితం బిజెపి అధికార ప్రతినిధి టీవీలో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో 46 సం॥లు నిరంతరాయంగా సాగిన కాంగ్రెస్ అక్రమ పరిపాలనతో పోరాడబోతున్నామని అన్నారు. కాంగ్రెస్ గతపాలన ప్రకాశవంతంగా లేదు. వారు ప్రజల్ని ఇంకేమాత్రం ఒప్పించలేరు. ఇతర శక్తులేవీ రంగంలో లేనపుడు, వారు ప్రతిపక్షంగా నిలబడితే, ప్రజలు వారివెంట వెళ్ళవచ్చు.

అయితే, మొట్టమొదటి నుండి పెట్టుబడిదారి దోపిడీకి, సామ్రాజ్యవాద దోపిడీకి, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారంతా ఐక్యమైతే, వారి కార్యకర్తలంతా ఒకచోట కలిస్తే, తాము ఐక్యమవుతున్నది, ఒకచోట చేరుతున్నది ఫాశిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి మాత్రమే కాదు, ప్రస్తుత వ్యవస్థను మార్చడానికనేది వాస్తవం. మరొక పాకలవర్గ పార్టీని ఓడించడానికి వారు ఐక్యంకావడంలేదు, కలవడం లేదు. నూతన శకానికి నాందిపలకడానికి, నూతన సమాజ కొత్తవేకువ కోసం వారు ఒకచోట కలుస్తున్నారు. మార్క్స్ చెప్పిన విధంగా 'దోపిడి నుండి విముక్తి' మీద ఆధారపడి మార్క్స్‌యొక్క మొత్తం సామాజిక తత్వశాస్త్రాన్ని విశ్లేషించినట్లైతే, శ్రమ స్వాతంత్ర్యం, స్వేచ్ఛాశ్రమ సంఘాలు అని మనకు అర్థమవుతుంది. బానిస వ్యవస్థనుండి భూస్వామ్య వ్యవస్థవరకు-పెట్టుబడిదారీ వ్యవస్థ వరకు చరిత్ర మొత్తంలో శ్రామికులు ఎలా దోపిడి చేయబడ్డారో మార్క్స్ మన కళ్ళకు కట్టినట్లు చూపారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ గురించి ప్రజలు మాట్లాడతారు. పార్టీల కామ్రేడ్స్, కొంతమంది ప్రతినిధులు కమ్యూనిస్టులు ప్రజాస్వామికంగా వుండరని వాదిస్తారు. వారు ప్రజాస్వామ్యాన్ని సరిగా పరిగణలోకి తీసుకోరంటారు. కానీ కమ్యూనిస్టు ప్రజాస్వామ్యాన్ని దాని నిజమైన అర్థంలో, సారంలో తీసుకుంటాడు. దాని సారం స్వేచ్ఛాశ్రమ. పెట్టుబడిదారీ సమాజంలో, అర్థభూస్వామ్య వ్యవస్థలో శ్రమను విముక్తి చేయకుండా 5 సం॥ల కొకసారి ఎన్నికలు జరపడం నిజమైన ప్రజాస్వామ్యం కాదు. అవును, అది పాక్షిక ప్రజాస్వామ్యం మాత్రమే; రాచరిక రాజ్యాలకన్నా, సైనిక నియంతృత్వాలకన్నా కొంత మెరుగైనది కావచ్చు. ప్రజలు కొంత స్వేచ్ఛ కలిగి వుండవచ్చు. అయితే ఇంకా శ్రామికులకు స్వేచ్ఛలేదు. ఎన్నికల తర్వాత పెట్టుబడిదారులచేత, భూస్వాములచేత, మిగతాశక్తులచేత ప్రజలు బానిసలుగా చేయబడతారు. సాంఘిక, ఆర్థిక రంగాలలో శ్రామికులకు స్వేచ్ఛనిచ్చి, అపుడు ప్రతినిధులకు ఎన్నికలు జరిపితే-మార్క్స్, లెనిన్ స్పష్టంగా తేటతెల్లం చేసిన విధంగా, సోవియట్‌లలో, కమ్యూన్‌లలో చాలా స్వేచ్ఛగా ప్రతినిధులు ఎన్నుకో బడతారు. శ్రామికవర్గ ప్రజలందరూ స్వేచ్ఛగా ప్రతినిధులను ఎన్నుకుంటారు. కమ్యూన్లలో స్వేచ్ఛా శ్రామికులకు ఆ స్థానం వుండేది, స్వతంత్రం వుండేది.

కనుక, అటువంటి సమాజంకోసం కలలుకంటూ, కామ్రేడ్స్ దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. రెండు రోజులనుండి ఇక్కడే వేదికమీద కూర్చొని వున్న సిపిఐ కామ్రేడ్స్ సెమినార్ చాలా బాగా జరుగుతుందని, హాల్‌లో కూర్చొని వున్న ప్రతినిధి కామ్రేడ్స్ గంభీరంగా చర్చిస్తున్నారని, సమస్యలను గ్రహించడానికి ప్రయత్నిస్తున్నారని, వివిధ ఉపన్యాసాలను శ్రద్ధగా వింటున్నారని, అవగాహన

పెంచుకుంటున్నారని చెప్పారు. ఇది మీకందరికి చాలా పెద్ద ప్రశంస కామ్రేడ్స్. ఒకటిన్నర రోజులుగా గంభీరతతో మీరందరూ కూర్చొని వున్నారు; భాషా సమస్య వుంది, భాషా సంబంధ సమస్యవల్ల ప్రతి విషయాన్ని మీరు అర్థంచేసుకోలేరు. అయినా మీరు వింటున్నారు, అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు, ప్రక్కన వున్న ఇతర కామ్రేడ్స్‌ను
అడిగి తెలుసుకుంటున్నారు. కనుక, ఈ విధమైన కార్యకర్తలను కమ్యూనిస్టులు కలిగి వున్నారు. మనమందరము కలిస్తే వర్గపోరాటాలలో, ఆర్థిక సమస్యలపై,
రాజకీయ సమస్యలపై మరియు ఇతర ప్రజాస్వామిక హక్కులు, స్వేచ్ఛలపై, దేశంలో ఆర్థిక స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ కలిగిన నిజమైన ప్రజాస్వామ్యంకోసం నిజంగా కలిసి పనిచేస్తే, అప్పుడు నిజంగా ప్రజారాశులను సమీకరించ గలం. ఈ సెమినార్ ఉద్దేశం అదే, దృష్టి అదే, ధ్యేయం అదే; దానికోసమే ఈ సాంప్రదాయేతర కృషిని చేపట్టాము. కమ్యూనిస్టు విప్లవకారులు కాని వారిని, మీతో దీర్ఘకాలంగా భిన్నాభి ప్రాయాలున్న పార్టీలను ఈ సెమినార్‌కు మీరు ఆహ్వానిస్తున్నారేమిటని కొందరు కామ్రేడ్స్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ తరహా ప్రయత్నం ఇది మొదటిసారి కావచ్చు. వర్గపోరాటాలు సాగిస్తున్న వారిని కారల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాన్ని, భావజాలాన్ని స్వీకరించిన వారిని, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిలబడిన వారందరినీ ఆహ్వానించాం. భిన్నాభిప్రాయాలమీద మనం సుదీర్ఘ చర్చ చేశాం. ఈ దేశం సంకట స్థితిలో వున్న ఈ సమయంలో మనం కొంత సాధారణతను కనుగొనడంలో ఒకటయ్యాం. నిజంగా దేశం సంకటసమయంలో వున్నది. మనం ఉమ్మడి అంశాలకు వద్దాం. ప్రజల సాధారణ అంశాలను, రగులుతున్న ప్రజల సమస్యలను 8 సాధారణ అంశాలుగా పేర్కొన్నాం. వాటికి గిరిజనులు, వారి భూమి, నీరు, వనరులు కోసం పోరాడుతున్న సమస్యను మరియు దేశం లోని మతోన్మాద ఫాశిజంయొక్క ప్రమాదాన్ని చేర్చాము. కనుక ఈ పది అంశాలను మనం అంగీకరించగలమా?

ఈ అంశాలను అందరం అంగీకరిస్తే, నూతన పోరాట శకానికి నాంది పలుకుదాం, కలిసి పోరాడుదాం, మనం చర్చించుకుందాం, వాదించుకుందాం కూడా, సిద్ధాంత సమస్యల గురించి ఒక కామ్రేడ్ అడిగారు. చర్చలలో మనలోతైన సిద్ధాంత, రాజకీయ అవగాహన పెరుగుతుంది. కనుక, ఐక్యత-పోరాటం రెండూ అవసరం. బడాబూర్జువా, బడా భూస్వామ్య, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుదాం, మరియు పోరాటాన్ని మెరుగైన మార్గంలో ఎలా నడపాలనేది మనమధ్య చర్చించుకుందాం. కొన్ని సంస్థలకు సంబంధించిన కామ్రేడ్స్ ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. వీరు నిజంగా మన కేంద్రకమిటీ తీసుకొన్న వైఖరిని, చొరవను స్వాగతించారు. ఒక కామ్రేడ్ కార్యాచరణ పథకము- కార్యక్రమము రూపొందిద్దామని ఒక ప్రశ్న వేశాడు. అపుడు మనం సాధారణ-కార్యాచరణ పథకము-కార్యక్రమము మేం రూపొందించ లేమని చెప్పాం. ఇక్కడ కలిసివచ్చే సంస్థలన్నీ కలిసి సమిష్టిగా దానిని అభివృద్ధిచేయాలి. కార్యాచరణ పంథా ఎలా రూపొందించాలి; పథకమేమిటి? కనీస కార్యక్రమము ఏమి వుండాలి? కొన్ని ప్రతిపాదనలు మేం చేశాం. ఒకే భావాలతో వున్న పార్టీలతో, సంస్థలతో చర్చించి వీటిని ఒక రూపానికి తేవాలి. కనుక ఈ సెమినార్ సమస్యకు ముగింపు కాదు, ఇది ప్రారంభం మాత్రమే. దీని తర్వాత సాధారణ అంశాలమీద అంగీకారం వున్న వివిధ పార్టీల ప్రతినిధులు, ఆ అంశాలమీద కలిసి పోరాడాలని అంగీకరించాలి. తక్షణమే, మనం సమస్యలపై పోరాడుదాం. ప్రజలను అణచివేస్తున్న సామ్రాజ్య వాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక పోరాటానికి సహకారం వుండాలి. ఆవిధంగా పోరాటాన్ని మనం కొనసాగిద్దాం.

తక్షణం ప్రాథమిక సమస్యలను తీసుకోవచ్చు. మిగతా పాలకవర్గ శక్తులతో కలిసి బిజెపిని ఓడించడం లేదా వ్యతిరేకించడమనే సాధారణాంశం చాలా చిన్నది. దానికన్నా మన సాధారణాంశం ప్రాతిపదిక చాలా పెద్దది. ఎందుకంటే పాలకవర్గ పార్టీలు దళారీ స్వభావం గల బడాబూర్జువాలచే నిధులు పొందుతున్నారు. వారు భూస్వామ్య శక్తులకు ప్రతినిధులు, సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లాయి. ఒకసారి ఈ అధికారపార్టీని ఓడిస్తే పాలకపార్టీలతో సాధారణాంశం పెద్దదిగా వుండదు. అయితే మనం వామపక్షశక్తులుగా, ప్రజాపక్షశక్తులుగా, కార్మికవర్గం, రైతాంగం, గిరిజనులు, మహిళలు, దళితులు, మైనారిటీల ప్రయోజనాలకోసం ప్రాతినిధ్యం వహిస్తాం. సామాజిక, ఆర్థిక, సమానత్వంకోసం పోరాడుతాం. ఒక ప్రభుత్వాన్ని తప్పించడానికి మాత్రమే కాకుండా, మన సాధారణాంశం భూమిక చాలా పటిష్టమైనది. దీర్ఘకాలంగా మన మధ్య సంబంధాలు క్షీణించాయి. దీర్ఘకాలంగా ఒకరితో ఒకరం పోరాడుకున్నాం, దీర్ఘకాలంగా ఒకరిని ఒకరం విమర్శించుకున్నాం. చాలాచోట్ల ఒకరితో ఒకరం ఘర్షణపడ్డాం. అయితే ఈ క్షణం మనం కలవాలి. ఒక కామ్రేడ్ చెప్పినట్లుగా విమర్శకన్నా ఆత్మవిమర్శ, విషయాలపట్ల ఆత్మచింతన అభివృద్ధిచేసుకోవాలి. మనం ప్రజాదోపిడీకి, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతాం; కార్మికవర్గ ఎజెండాను ముందుకు తీసుకెళ్దాం. శ్రామికవర్గాన్ని విముక్తి చేద్దాం; నూతన విముక్త సమాజంలో ప్రవేశిద్దాం. సోవియట్ యూనియన్, చైనాలయొక్క సుసంపన్న, విస్తృతమైన అనుభవాలు కార్మికవర్గం కలిగివుంది. ఆ దేశాలు నేడు పెట్టుబడిదారీ పంథాను చేపట్టాయి. అయితే దీంతో చరిత్ర ముగింపు కాలేదు. చరిత్ర ముందుకు వెళ్తున్నది; చరిత్ర మళ్ళీ డిమాండ్ చేస్తున్నది. మళ్ళీ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వైఫల్యాలను చూపిస్తున్నది; పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని ఓడించి సోషలిజం, కమ్యూనిజంలలోకి వెళ్ళమని ప్రజల్ని, శ్రామిక ప్రజల్ని, కార్మికవర్గాన్ని అడుగుతున్నది. మళ్ళీ అది అజెండా మీద వుంది; మళ్ళీ అది తలుపు తడుతున్నది. ఇది మన అవగాహన, సెమినార్‌లో పాల్గొంటున్న సంస్థలకు వినమ్ర విజ్ఞప్తి, మరియు ప్రస్తుతం పాల్గొనలేకపోయిన సంస్థలతో కూడా సంప్రదింపులు చేద్దామనుకుంటున్నాం. ప్రతినిధుల సమావేశాలు జరుపుకుందాం, మాట్లాడుకుందాం. మరిన్ని సంభాషణలు కొనసాగిద్దాం. మనం సాధారణ ఐక్య కార్యాచరణ రూపొందించుకోగలం; దీర్ఘకాలిక పోరాటాలను అభివృద్ధిచేయడానికి ప్రయత్నిద్దాం. ఇది మా ముగింపు. ధన్యవాదాలు.



ooooo